క్లుప్తంగా

మాస్టర్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేత శైలజ



అవార్డును అందుకుంటున్న శైలజ

పోలాకి: రాష్ట్ర స్థాయి మాస్టర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మబగాం గ్రామానికి చెందిన శిమ్మ శైలజ విజేతగా నిలిచారు. విజయవాడ క్లబ్‌లో ఇటీవల జరిగిన 2024–25 (35 ప్లస్) మహిళల సింగిల్స్ విభాగంలో శైలజ సత్తాచాటారు. ఏపీబీవీ అధ్యక్షుడు ఎం.ద్వారకానాథ్, కార్యదర్శి అంకమ్మచౌదరి తదితరుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. శైలజ ఓం పరంపర ఆధ్యాత్మిక సంస్థలో భగవద్గీతను బోధిస్తుంటారు. వచ్చే నెలలో జరిగే జాతీయస్థాయి పోటీలకు సిద్ధమవుతున్నట్లు ఆమె తెలిపారు.

సందడే.. సందడి



డ్యాన్స్ చేస్తున్న సత్యవరం ఉన్నత పాఠశాల విద్యార్థినులు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం, సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల వార్షికోత్సవాలు, టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. విద్యార్థులు ఒకరితో మరొకరు పోటీపడి జానపద గీతాలకు, సినిమా పాటలకు డాన్స్‌లు చేశారు. తొటి విద్యార్థులు కేరింతలతో సందడి నెలకొంది. హెచ్‌ఎంలు హర్షవర్ధన శర్మ, వకులా రత్నమాల మాట్లాడుతూ.. క్రమశిక్షణగా చదువుకోవాలని, ఒత్తిడికి గురి కావద్దని, ఆత్మస్థైర్యంతో ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరామర్శ..



సత్యనారాయణ పండా కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణచైతన్య, నాయకులు

నరసన్నపేట: స్థానిక గాంధీనగర్‌కు చెందిన మిమిక్రీ ఆర్టిస్టు సత్యనారాయణ పండా కుటుంబాన్ని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య శనివారం పరామర్శించారు. సత్యనారాయణ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. సత్యనారాయణ సోదరులు, కుటుంబ సభ్యులకు కృష్ణచైతన్య ధైర్యం చెప్పారు. నరసన్నపేట ఎంఈఓ ఉప్పాడ శాంతారావు తండ్రి కృష్ణమూర్తి ఇటీవల మృతి చెందారు. ఎంఈఓ కుటుంబాన్ని కృష్ణచైతన్య పరామర్శించారు. పరామర్శించిన వారిలో నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, బుద్దల రాజశేఖర్, పాట్నూరు ప్రసాదరావు, పెదిరెడ్ల రాము, తదితరులు ఉన్నారు.

వన్డే మ్యాచ్‌లకు హరీష్ ఎంపిక



బత్తుల హరీష్

హిరమండలం: ఏప్రిల్‌లో శ్రీలంకలో జరగనున్న వన్డే మ్యాచ్‌లకు (క్రికెట్ అండర్–23) హిరమండలం మండలం గొట్టా గ్రామానికి చెందిన బత్తుల హరీష్ ఎంపికయ్యారు. తెలంగాణలో రాష్ట్ర స్థాయి క్రికెట్ అండర్–23 క్రికెట్ టీ–20 పోటీలు ఫిబ్రవరి 22 నుంచి 28వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీల్లో హరీష్ సెంట్రల్ ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొని సత్తా చాటారు. ఈ పోటీల్లో సుమారు 10 జట్లు పాల్గొన్నాయి. ఇందులో ప్రతిభ చూపిన 18 మందిని వన్డే మ్యాచ్‌లకు ఎంపిక చేశారు. ఈ ఎంపికలో హరీస్ ఉండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం కేశవరావు

హిరమండలం: మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కేశవరావు అన్నారు. శనివారం పర్యావరణ పరిరక్షణ నినాదంతో పాతపట్నం నుంచి హిరమండలం వరకు 20 కిలో మీటర్ల మేర సైకిల్ యాత్ర చేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులతో మొక్కలు నాటించారు. ప్రతి విద్యార్థి సైకిల్ తొక్కాలని.. తద్వారా శరీరక ఆరోగ్యం లభిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించారు. హెచ్‌ఎంను పలువురు అభినందించారు.

ఆధార్ అవస్థలు..!



పురుషోత్తపురం సచివాలయంలో పనిచేయని ఆధార్ కేంద్రం

- సచివాలయాల్లో నమోదుకు తిప్పలు
- తరచూ మొరాయిస్తున్న సర్వర్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సరుబుజ్జిలి: పుట్టిన పిల్లాడి నుంచి వృద్ధుల వరకు.. రేషన్ మొదలుకుని ఫించన్ అందజేసేందుకు అన్నింటికీ ఆధార్ అత్యవసరం. దీంతో ఆధార్ నమోదు, సవరణలకు ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయాల్లోనే సేవలు పొందేలా చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా నియోజకవర్గంలోని మొత్తం 14 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చాలాచోట్ల ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదు. దీంతో నానా అవస్థలు పడుతున్నారు.

ఎంపిక చేసిన కేంద్రాలు..

నియోజకవర్గం పరిధిలోని 14 సచివాలయాల్లో అధికారులు ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో సరుబుజ్జిలి మండలంలోని షళంత్రి, పురుషోత్తపురం, సరుబుజ్జిలి, బూర్జ మండలంలో బూర్జ, పాలవలస, కొల్లివలస, ఆమదాలవలస మండలంలో కొర్లకోట, జొన్నవలస, ఎస్జీవాడ, దూసి, పొందూరు మండలంలో పొందూరు, రాపాక, లోలుగు, తాడివలస సచివాలయాలు ఉన్నాయి.

మండలం	సరుబుజ్జిలి	పొందూరు	ఆమదాలవలస	బూర్జ
సచివాలయాలు	14	27	19	16
ఆధార్ కేంద్రాలు	3	4	4	3

తరచూ సమస్యలు

ఆధార్ కేంద్రాల్లో సర్వర్లు తరచూ మొరాయిస్తుండడం వలన సక్రమంగా సేవలు అందడం లేదు. దీంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి సేవల కోసం వచ్చిన మహిళలు, వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులు, గర్భిణులు నానా అవస్థలు పడుతున్నారు. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం సచివాలయంలో పూర్తిగా సేవలు నిలిచిపోయాయి. మిగిలినవాటిలో అరకొరసేవలతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.

ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది



సచివాలయాల్లో ఆధార్ సేవలు సక్రమంగా అందడం లేదు. దీంతో హిరమండలం, ఆమదాలవలస, శ్రీకాకుళంలోని ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీనివలన వ్యయ, ప్రయాసలకు గురవుతున్నాం. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.

– బద్రి రామారావు, పెద్దసవలాపురం, సరుబుజ్జిలి

చర్యలు తీసుకుంటాం



సర్వర్ల లోపాల వలన కొన్ని ఆధార్ కేంద్రాల్లో సేవలకు అంతరాయం కలుగుతోంది. వెంటనే పరిశీలన చేసి వాటిని సరిచేస్తాం. త్వరలోనే అన్ని కేంద్రాల్లో సేవలను సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటాం.

– ఎం.పావని, ఎంపీడీఓ, సరుబుజ్జిలి

రేషన్ అందడం లేదు

- సమస్యలపై ప్రశ్నించిన సభ్యులు
- ధాన్యం కొనుగోలులో జాప్యంపై నిలదీత



రేషన్ సరుకులపై ప్రశ్నిస్తున్న బుడితి ఎంపీటీసీ సభ్యుడు మురళి

సారవకోట: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై అధికారులను సభ్యులు నిలదీశారు. బుడితి–1వ రేషన్ డిపో పరిధిలో గత కొన్ని నెలల నుంచి కార్డుదారులకు రేషన్ సరుకులు అందడం లేదని ఎంపీటీసీ సభ్యుడు మురళి ప్రశ్నించారు. అవలింగిలో కూడా చాలా మందికి రేషన్ సరుకులు అందడం లేదని సర్పంచ్ కింజరాపు ధర్మారావు సభ దృష్టికి తీసుకువచ్చారు. గుమ్మపాడు సచివాలయ వీఆర్వో మదన్‌మోహన్ విధులకు సరిగా హాజరుకావడం లేదని కోదడ్డ పనస సర్పంచ్ బాడాన కృష్ణారావు, గుమ్మపాడు సర్పంచ్ బమ్మిడి లక్ష్మి ఆరోపించారు. చీడిపూడి పంచాయతీలో ఎల్‌పీ నంబర్లు తప్పులుగా ఉన్నాయని సర్పంచ్ నిక్కు కృష్ణారావు సభ దృష్టికి తీసుకువచ్చారు. పెద్దలంబ పంచాయతీలో చాలా మంది రైతుల ధాన్యం నేటికీ కళ్లాలు, ఇళ్ల వద్ద ఉన్నాయని సర్పంచ్ ఇసై షణ్ముఖరావు అన్నారు. గత డిసెంబర్ నుంచి టార్గెట్‌లు అయిపోయాయని చెప్పి ధాన్యం కొనుగోలు చేయడం లేదరన్నారు. వీటితోపాటు పలు సమస్యలు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, మండల ప్రత్యేకాధికారి ఎం.లోకనాథం, ఎంపీడీఓ మోహన్ కుమార్, తహసీల్దార్ విజయకుమారి పాల్గొన్నారు.

టైమ్ స్కేల్ అమలయ్యేదెప్పుడు?



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి

హిరమండలం: ఏళ్ల తరబడి సమగ్ర శిక్ష ఉద్యోగులు, కేజీబీవీ కాంట్రాక్టు ఉపాధ్యాయులు అరకొర వేతనాలతో పనిచేస్తున్నారని, వీరికి మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం స్థానిక కేజీబీవీ ఆవరణలో సమావేశం నిర్వహించారు. కేజీబీవీ, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ వివక్షకు గురిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 352 కేజీబీవీల్లో 3,168 మంది, సమగ్ర శిక్షణలో పనిచేస్తున్న 24 వేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. 2019లో అప్పటి ప్రభుత్వం పలు జీఓలను విడుదల చేసిందని, నేటికీ అవి అమలుకు నోచుకోలేదన్నారు. జిల్లా కార్యదర్శి జి.రమణ, కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, హిరమండలం ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు కె.నాగరాజు, బి.గోవిందరావు, ప్రత్యేకాధికారి ఎస్.కృష్ణవేణి పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తం



కుద్దిరాంలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఏడీ ఆనందరావు


ఆమదాలవలస: వేసవిలో పశువులకు వచ్చే వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ ఏడీ ఆర్.ఆనందరావు సూచించారు. శనివారం పురపాలక సంఘం పరిధిలోని 21వ వార్డు కుదిరాంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఏడీ మాట్లాడుతూ మార్చి 1 నుంచి 30వ తేదీ వరకు మండల వ్యాప్తంగా ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతీరోజు మూడు బృందాలు వారి పరిధిలోని గ్రామాల్లో టీకాలు వేయడం జరుగుతుందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలానికి మూడు విడతల్లో 1,220 బ్రూసెల్లోసిస్ డోసులు వచ్చాయన్నారు. మొదటి విడతలో 370, రెండో విడతలో 390, మూడో విడతలో 460 డోసులు వచ్చాయన్నారు. 4 నుంచి 8 నెలల ఆడ దూడలకు మాత్రమే ఈ టీకాలు వేస్తామన్నారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి మండలానికి 10 వేల గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. మండలంలో 9079 తెల్ల జాతి (ఆవులు), 518 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసేందుకు 3 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నాడు–నేడు రికార్డుల పరిశీలన

పొందూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన నాడు–నేడు పనులకు సంబంధించిన ఖర్చుల రికార్డులు, తీర్మానాలు, బ్యాంకు చెక్కులను ఏపీఈడబ్ల్యూడీఓ అధికారులు శనివారం పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈ కె.రాములు, ఏఈ సాయికిరణ్ రికార్డులు పరిశీలించారు. రికార్డుల్లో పలు లోపాలను గుర్తించారు. వీటిపై నివేదికలను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు

- అధికారులకు కలెక్టర్ హెచ్చరిక



రహదారిని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పొందూరు: కేంద్ర నిధులతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా లోపాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని వీధుల్లో పర్యటిస్తున్న సందర్భంగా రోడ్లను పరిశీలించారు. కాకర్ల నర్సింగ్ హోం నుంచి కనకల వీధి వరకు నిర్మించిన రహదారుల నాణ్యతను పరిశీలించారు. రోడ్ల నిర్మాణాల వద్ద అధికారుల పర్యవేక్షణ ఎందుకు ఉండడం లేదని పీఆర్ డీఈ చంద్రశేఖర్‌ను ప్రశ్నించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పీఆర్ సిబ్బంది లేకుండా నిర్మిస్తున్న రోడ్లలో నాణ్యత లేకుంటే ఎవరు బాధ్యులంటూ ప్రశ్నించారు. నిర్మాణాలపై క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఎంపీడీఓ మన్మథరావు, ఈఓ మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు వేగవంతం చేయండి..

వర్క్ ఫ్రమ్ హోంపై ఆసక్తి కనబరుస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల సమాచార సేకరణ వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. మండల కేంద్రంలో వర్క్‌ఫ్రమ్ హోం సర్వేను పరిశీలించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు, కంప్యూటర్ విద్యను అభ్యసించిన విద్యార్థులు, ఉన్నత విద్యావంతులును గుర్తించాలన్నారు. ఇంటినుంచే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలంటే వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ఈ సర్వేను చేపడుతోందన్నారు. ఇప్పటికే మండలంలో 403 మంది విద్యార్థులను గుర్తించామని కలెక్టర్‌కు ఎంపీడీఓ మన్మథరావు తెలిపారు. కలెక్టర్.. నేరుగా ఓ విద్యార్థి నుంచి వివరాలను సేకరించారు.

ఉద్యోగుల సంక్షేమానికి నిధులేవి?



గురుగుబెల్లి భాస్కరరావు

ఆమదాలవలస: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఉద్యోగుల సంక్షేమాన్ని పూర్తిగా మరచిపోయిందని, ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేసిందని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గురుగుబెల్లి భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. డీఏ, ఐఆర్‌ల ఊసే లేదని, కనీసం ఉద్యోగుల సరెండర్ లీవ్స్‌ను నగదుగా మార్చుకోవడాన్ని కూడా ఈ ప్రభుత్వం వచ్చాక అవకాశం కల్పించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రకమైన చర్యలు ఉద్యోగులను అణిచివేయడంలో ఓ భాగమేనని, ఇటువంటి ఉద్యోగ వ్యతిరేక చర్యలతో ఉద్యమాలు పుట్టుకొస్తాయన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో–57ను అమలుకు భరోసా ఇవ్వాలని కోరారు.

ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంలేదు..

జలుమూరు: అభివృద్ధి పనులకు సబంధించిన సమాచారాన్ని స్థానిక ప్రజా ప్రతినిధులకు అధికారులు ఇవ్వడం లేదని జిల్లా వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ అధ్యక్షుడు దామ మన్మథరావు ఆరోపించారు. ఇటీవల ఉపాధి నిధులతో పాగోడులో జరుగుతున్న పనులపై సంబంధిత అధికారులు కనీసం సమాచారం ఇవ్వలేదని, పైగా రాజకీయం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో సర్పంచ్‌లకు తగిన ప్రాధాన్యత లేదన్నారు. అభివృద్ధికి తాము అడ్డు పడటంలేదని, అలాగని సమాచారం ఇవ్వకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

సంక్షిప్తంగా..

ఇళ్ల స్థలాలు పరిశీలన

మెళియాపుట్టి: సొంత ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేటప్పుడు నిబంధనలను పాటించాలని ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా, హౌసింగ్ ఏఈ గణేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు వీధుల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే స్థలాలను పరిశీలించారు. లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ వసంత, పలువురు లబ్ధిదారులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హిరమండలం: ఈ నెల 2వ తేదీన హిరమండలం 11 కేవీ ఫీడర్‌లో అదనపు స్తంభాల ఏర్పాటుతోపాటు జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ శంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్ర 5 గంటల వరకు హిరమండలం, సుభలాయి, నౌగూడ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు మండల సమావేశం

పాతపట్నం: ఈ నెల 2వ తేదీన మండల సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ టి.చంద్రకుమారి శనివారం తెలియజేశారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలో వివిధ శాఖ అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

పొందూరు రూరల్: గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ కె.లీలారాణి అన్నారు. శనివారం లోలుగు రైతు సేవా కేంద్రంలో లోలుగు, పొందూరు సెక్టార్ల అంగన్‌వాడీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పిల్లలకు ఆధార్ కార్డులు తీసుకోవాలని సూచించారు. ప్రతీ మూడో శనివారం స్వచ్ఛాంధ్ర పోటోలు యాప్‌లో నమోదు చేయాలన్నారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. కిశోర బాలికలకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఆధార్ డ్రైవ్ సక్రమంగా జరగడం లేదు

సరుబుజ్జిలి: గ్రామ సచివాలయాల్లో ఆధార్ స్పెషల్ డ్రైవ్ సక్రమంగా జరగడం లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బద్రి రామారావు ఆరోపించారు. మండల కేంద్రంలో శనివారం మాట్లాడుతూ.. ఇటీవల పెద్దసవలాపురం సచివాలయంలో నిర్వహించిన ఆధార్ క్యాంపులో నిర్దిష్ట వేళలు పాటించలేదన్నారు. తక్కువ కాలంలో ముగించడం వలన చాలామంది ఆధార్‌కోసం వచ్చిన వారు ఇబ్బంది పడ్డారని తెలిపారు. పింఛన్ల పంపిణీ చేయాలన్న నెపంతో ఆధార్ డ్రైవ్ నిర్వహించే ఉద్యోగులు ఆదరబాదరాగా కార్యక్రమాన్ని ముగించారన్నారు.

చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి తేవాలి

సారవకోట: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్‌పీఓ గోపిబాల సూచించారు. శనివారం మండలంలోని గొర్రిబంద, సారవకోట గ్రామాల్లో ఇటీవల నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. గ్రామాల్లో ఉన్న చెత్తను సేకరించి ఈ కేంద్రాలకు తరలించి రీసైక్లింగ్ చేయాలన్నారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఈఓపీఆర్డీ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శులు విష్ణు, లక్ష్మి ఉన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై చిన్నచూపు

- రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల కేటాయించలేదు
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో శ్రీకాకుళం జిల్లాకు ప్రాధాన్యత ఇవ్వలేదని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి ఎలాంటి కేటాయింపులు చేయలేదన్నారు. వంశధార పనులకు కేవలం రూ.5.75 కోట్ల నిధులు కేటాయించడం జిల్లా ప్రజల దురదృష్టమన్నారు. వంశధార నీటిని ఉద్దానం, పాతపట్నం నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అందించేందుకు నిధులు కేటాయింపులు లేవన్నారు. మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు కోసం నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. మరో ఏడాది పాటు గిరిజనులకు ఐటీడీఏ సేవలు అందని ద్రాక్షగా మిగిలిపోవటమేనా అని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు నిధులు కేటాయింపులు అరాకొరగానే ఉన్నాయన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, విద్య, వైద్యం, సంక్షేమానికి నిధులు పూర్తిస్థాయిలో కేటాయించలేదన్నారు. మహిళలకు ఉచిత బస్, రైతులకు పెట్టుబడి సాయం, తల్లికి వందనం, నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు, మహిళలకు రూ.1500 అందిస్తామని ఇచ్చిన హామీలు చంద్రబాబు మరిచిపోయారా అని నిలదీశారు.

బడ్జెట్‌లో కేటాయింపులు ఉంటాయని ఆయా వర్గాల వారు ఎంతో ఆశగా ఎదురు చూశారని, చివరకు మొండి చేయి మిగిలిందన్నారు. సీనియర్ ముఖ్యమంత్రిని, ఆర్థికవేత్తను అని చెప్పుకునే చంద్రబాబు ఆధ్వర్యంలో అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై అన్ని వర్గాల వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమానికి, అన్నివర్గాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అందరూ గుర్తు చేసుకుంటున్నారన్నారు.

అభివృద్ధి లేదు.. సంక్షేమం లేదు

- అమరావతి లక్ష్యంగా బడ్జెట్
- ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమం లేదని, కేవలం అమరావతి అభివృద్ధే లక్ష్యంగా ఈ బడ్జెట్ ఉందని ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆరోపించారు. పట్టణంలోని బొడ్డేపల్లిపేటలో గల జగనన్న ప్రజా సేవా కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. సూపర్ సిక్స్‌లోని ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు హామీలను అటకెక్కించారన్నారు. మేనిఫెస్టోలో అమలు చేస్తామన్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొర నిధులే కేటాయించారన్నారు. 50 ఏళ్లకే బీసీలకు పెన్షన్ ఇస్తామని చెప్పి.. ఇప్పుడు ఆ పథకానికి మంగళం పాడారన్నారు. ఇప్పటికే తొలగించిన లక్షా 20 వేల పెన్షన్లతోపాటు మరో 10 లక్షల పెన్షన్లను తొలగించేందుకు బడ్జెట్లో కేటాయింపులు తగ్గించారన్నారు. ఇదంతా పేదవారి పొట్ట కొట్టడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీపం పథకానికి తూట్లు పొడిచేలా బడ్జెట్లో తక్కువ మొత్తం కేటాయించారన్నారు. ఉద్యోగుల కోసం ఐఆర్, పీఆర్సీ వంటి విషయాలు ప్రస్తావించలేదన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసి రాష్ట్రాన్ని శ్రీలంకగా మార్చిందని బీరాలు పలికిన చంద్రబాబు.. 2025–26లో రూ.లక్షా 4 వేల కోట్ల అప్పులు చేస్తామని బడ్జెట్‌లో పెట్టారన్నారు. ఇలా అప్పులు చేసిన మొత్తాన్ని రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి, ఉపాధి, సంక్షేమం కోసం ఉపయోగించకుండా తన రియల్ ఎస్టేట్ అభివృద్ధి కోసం అమరావతిలో పెడుతున్నారని మండిపడ్డారు. అమరావతి కోసం రూ.48 వేల కోట్ల టెండర్లు పిలిచారని, దీనిని బట్టి చంద్రబాబు రాష్ట్రాన్ని గాలికి వదిలి, ఒక్క అమరావతి పైనే దృష్టి పెట్టారని విమర్శించారు. ప్రజలంతా దీన్ని గమనించాలని, మేధావులు ఆలోచన చేయాలన్నారు.

శ్రామికులకు నిరాశ



మాట్లాడుతున్న సూరయ్య

మెళియాపుట్టి: శ్రమనే నమ్ముకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నిరాశపరిచిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సూరయ్య అన్నారు. శనివారం చాపర సీఐటీయూ కార్యాలయంలో పలు సంఘాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో వేతనాలు పెరుగుతాయని ఆశించిన శ్రామికులకు నిరాశేదక్కిందన్నారు. ఎటువంటి జీఓ అమలు చేయకుండానే అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ పెంచింది తమ ప్రభుత్వమే అని కూటమి నాయకులు ప్రగల్భాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. ముఠా, భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు బడ్జెట్‌లో కనిపించలేదన్నారు. ఉద్యోగులకు పీఆర్సీ అమలు, కార్మికుల వేతనం పెంపుపై ప్రభుత్వం కనీసం ఊసెత్తలేదన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయకపోతే కార్మికులు రోడ్డెక్కాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, కలాసీ సంఘం నాయకులు దామోదరరావు, నారాయణ, నిరంజన్, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి నోటీసులు

సరుబుజ్జిలి: మండలంలోని కె.జె.పేట అంగన్‌వాడీ హెల్పర్, రొట్టవలస కాలనీ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త, హెల్పర్లకు మెమోలు జారీ చేసినట్లు బూర్జ ఐసీడీఎస్ పీఓ గీత శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. కె.జె.పేట సహాయకురాలిపై పలు ఆరోపణలు వచ్చాయని, రొట్టవలస–2 కార్యకర్త, సహాయకురాలు విధులకు గైర్హాజరుపై మెమోలు అందించామన్నారు. వారినుంచి స్పష్టమైన సమాధానాలు రాకపోతే తదుపరి చర్యలు నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందన్నారు.